క్లుప్తంగా

తోటపల్లిలో ప్రత్యేక పూజలు



ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన అన్నదానంలో పాల్గొన్న భక్తులు

గరుగుబిల్లి: తోటపల్లి వేంకటేశ్వరస్వామి, పద్మావతి అమ్మవార్ల దర్శనానికి శనివారం భక్తులు పోటెత్తారు. శ్రావణమాసం కావడంతో పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. పుట్టుదేవుని వద్ద పలువురు భక్తులు తలనీలాలు సమర్పించారు. దాతల సహకారంతో ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు, సిబ్బంది చర్యలు చేపట్టారు.

ముగిసిన శిక్షణ కార్యక్రమం



సర్పంచ్‌లు, కార్యదర్శులకు సూచనలు చేస్తున్న ఈఓపీఆర్డీ కృష్ణారావు

భామిని: మండలంలోని పంచాయతీ సర్పంచ్‌లు, కార్యదర్శులకు నిర్వహించిన రిఫ్రెషర్ శిక్షణ కార్యక్రమం శనివారంతో ముగిసింది. ఈఓపీఆర్డీ జి.కృష్ణారావు పర్యవేక్షణలో రిసోర్స్ పర్సన్లు జీపీడీపీల తయారీపై మూడురోజుల పాటు శిక్షణ ఇచ్చారు. గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికల తయారీ, నిధుల వినియోగం, ఆదాయ మార్గాల అన్వేషణ, వ్యయాల నియంత్రణ, ఎల్ఈడీ లైట్లు వినియోగం, తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

రహదారిపై వరినాట్లు



రహదారి గోతుల్లో వరినాట్లు వేస్తున్న సీపీఎం నాయకులు

కొమరాడ: పార్వతీపురం-కూనేరు రహదారి గోతులతో నిండి అధ్వానంగా తయారైంది. ఈ మార్గంలో రాకపోకలు సాగించే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారి మరమ్మతులు చేపట్టాలని కోరుతూ సీపీఎం నాయకులు శనివారం నిరసన తెలియజేశారు. చోళ్లపదం సమీపంలో రహదారి గోతుల్లో వరినారు నాటుతూ వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కొల్లి సాంబమూర్తి మాట్లాడుతూ.. ఒడిశా, రాయిపూర్ తదితర రాష్ట్రాల్లోని భారీ పరిశ్రమలకు ముడిసరుకులు తీసుకుని వెళ్లే లారీలు రహదారి గోతుల వల్ల తరచూ మరమ్మతులకు గురవుతున్నాయని, రోడ్డుపై మోరాయించడంతో ట్రాఫిక్‌కు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని అన్నారు. అధికారులు స్పందించి రహదారి మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఇచ్చిన హామీలు అమలు చేయాలి



మాట్లాడుతున్న గిరిజన సంక్షేమ సంఘ నాయకులు

పార్వతీపురం టౌన్: ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలను అమలు చేయాలని గిరిజన సంక్షేమ సంఘ ఉత్తరాంధ్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తాడంగి సాయిబాబు, పాలక రంజిత్‌కుమార్ కోరారు. ఈ మేరకు శనివారం స్థానిక ఐటీడీఏ కార్యాలయం వద్ద వారు మాట్లాడుతూ.. పాడేరులో మెడికల్ కళాశాల, కొమరాడ మండలంలోని పూర్ణపాడు - లాబేసు వంతెన, పాలకొండ ఏరియా ఆస్పత్రి భవనాన్ని త్వరగా పూర్తి చేయాలని కోరారు. సీతంపేట ఐటీడీఏ పరిధిలో పసుపు ఉత్పత్తి కేంద్రం ఏర్పాటుకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. అలాగే కురుపాంలోని గిరిజన ఇంజినీరింగ్ కళాశాలను కూడా పూర్తి చేయాలని కోరారు. అకస్మాత్తుగా ఐటీడీఏ పీఓల బదిలీల నేపథ్యంలో ఐఏఎస్‌లనే ఐటీడీఏ పీఓలుగా నియమించాలని కోరారు.

లోక కల్యాణార్థం గీతాపారాయణం



గీతాపారాయణం చేస్తున్న భజన మండలి సభ్యులు

సీతానగరం: ప్రజల్లో భక్తిభావాలను పెంపొందించడానికే గీతా పారాయణం చేస్తున్నామని కృష్ణ మందిరం (బూర్జ) అర్చకుడు ఆర్. శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని కృష్ణారాయపురంలో పి. బలరాంనాయుడు నివాసంలో తెలుగు పండిట్ జి. అప్పలస్వామి పర్యవేక్షణలో శనివారం గీతా పారాయణం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ, ప్రజల్లో భక్తిభావాలను పెంపొందించడానికి ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

నాట్లు ఆలస్యమైతే ఆందోళన వద్దు



పాలకొండలో నాట్లు వేసేందుకు వరినారు సిద్ధం చేస్తున్న రైతులు

- యాజమాన్య పద్ధతులు అవలంభిస్తే దిగుబడులు యథాతథం
- ముదురిన వరి నారుతో ఇబ్బందులు దూరం
- రైతులకు వ్యవసాయాధికారి వాహిని సూచనలు



పాలకొండ రూరల్:

జిల్లాలో ఈ ఏడాది వర్షపాతం అనుకూలించటంతో పాటు, సాగునీటి వనరులు కలిసిరావటంతో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సుమారు 73వేల హెక్టార్లలో వరి సాగుకు రైతులు ఉపక్రమించారు. ఇందులో దాదాపు 18వేల హెక్టార్లలో వరి వెదలు వేసుకోగా.. 52వేల హెక్టార్లలో నాట్లు వేశారు. మిగిలిన చోట్ల నారు సిద్ధమైనప్పటికీ ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా 3వేల హెక్టార్లలో నాట్లు అలస్యం అయ్యాయి. ఈ క్రమంలో ముందుగానే సిద్ధం చేసుకున్న వరినారు ముదురిపోతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అయితే ముదురు నారు నాటుకునే సమయంలో కొన్ని మెళకువలు పాటిస్తే దిగుబడులు యధాతదంగా వస్తాయని, దీని వల్ల ఎటువంటి ఇబ్బందులు లేవని వ్యవసాయాధికారి ఎన్ని వాహిని సూచించారు.

ఇలా చేస్తే మేలు..

వర్షాధారంగా, సాగునీటి కాలువల ద్వారా నీరు లభ్యతకు అనుగుణంగా ఉన్న భూముల్లో ముదురు వరినారు నాటేటప్పుడు రైతులు తగు యాజమాన్య పద్ధతులు పాటించాలి.

- ముఖ్యంగా 35 నుంచి 50 రోజుల నారు వయసు ఉంటే చదరపు మీటరుకు 44 కుదుళ్లు, 50 నుంచి 65 రోజుల వయసు ఉంటే చదరపు మీటరుకు 66 కుదుళ్లు ఉండేల మొనలు వేసుకోవాలి.
- ముదురు నారును లోతుగా నాటితే దిగుబడి తగ్గే అవకాశం ఉంది. అందువల్ల నాట్లు తక్కువ లోతులో వేస్తే పిలకలు అధికంగా వచ్చే అవకాశం ఉంటుంది.
- ఈ తరహా నారు నాటేటప్పుడు నిర్ణీత విస్తీర్ణంలో కుదుళ్ల సంఖ్యను పెంచి కుదురుకు దగ్గర దగ్గర 4 నుంచి 5 మొక్కలు వంతున వేయాలి.
- సిఫార్సు చేసిన మోతాదు కంటే 25 శాతం పెంచి 3 దఫాలుగా కాకుండా 2 దఫాలుగా అంటే 70 శాతం ఆఖరి దమ్ములో ఎకరానికి 50 కిలోల డీఏపీ, 35 కిలోల యూరియా, 25 కిలోల పొటాష్, మిగతా 30 శాతం అంటే 30 కిలోల యూరియా, 15 కిలోల పొటాష్ అంకురం దశలో వాడాలి.
- నత్రజని ఎరువులను బురద పదునులో మాత్రమే సమానంగా వెదజల్లి 36-48 గంటల తరువాత పలుచగా నీరు పెట్టాలి.
- నారు ఉడిచేందుకు సన్నద్ధం చేసేటప్పుడు నారు కట్టల చివర్లు తుంచి నాటాలి. ఇలా చేయడం వలన నారులో ఉండే కీటకాలను నియంత్రించవచ్చు.
- ముఖ్యంగా కాండం తొలుచు పురుగు ఆకు కొనలపై పెట్టిన గుడ్లు నాశనమవుతాయని రైతులు గుర్తించాలి.
- నాటిన తరువాత ప్రతీ 2 మీటర్లకి 20 సెంటీమీటర్ల వెడల్పున కాలిబాటలు ఏర్పాటుచేయాలి. దీని వలన పైరుకు గాలి, వెలుతురు బాగా తగిలి చీడపీడల ఉధృతి కొంతవరకు అదుపు చేయవచ్చు.
- ఎరువులు, పురుగు, కలుపు మందులను వేయడానికి, పైరు స్థితిగతులను గమనించడానికి ఈ కాలిబాటలు ఉపయోగపడతాయి. ఈ కాలిబాటలు నాటే సమయంలో లేదా నాటిన 5 రోజుల వ్యవధిలో తీసుకోవాలి.
- ముదురు నారు నాటిన 15 రోజుల్లోగా కార్బోఫ్యూరాన్ 3-జీ గుళికలు ఎకరానికి 8 కిలోల చొప్పున వేసుకుంటే తొలి దశలో కాండం తొలుచు పురుగు ఉధృతి నియంత్రించవచ్చు.



వరినాట్లు వేస్తున్న వ్యవసాయ కూలీలు

యూటీఎఫ్‌కు 50 ఏళ్లు పూర్తి



యూటీఎఫ్ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న సంఘ నాయకులు

గరుగుబిల్లి: యూటీఎఫ్ ఆవిర్భవించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా రాష్ట్ర శాఖ పిలుపు మేరకు మండలంలోని ఎర్రన్నగుడి జంక్షన్ వద్ద శనివారం యూటీఎఫ్ పతాకావిష్కరణ కార్యక్రమాన్ని జిల్లా కార్యదర్శి పి.వెంకటనాయుడు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యమాలే ఊపిరిగా, విద్యారంగం పరిరక్షణకు యూటీఎఫ్ తనదైన శైలిలో నిరంతరం పోరాటం చేస్తోందన్నా రు. యూటీఎఫ్ సంఘాన్ని నడిపించేందుకు యువ త ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు కె.గోవిందమ్మ, ఐ.ఎరుకునా యుడు, టి.శ్రీనివాసరావు, పి.శ్రీనివాసరావు, తదితరులు ఉన్నారు.

దళితుల భూ సమస్యను పరిష్కరించాలి

పార్వతీపురం టౌన్: శివ్వాం దళితుల భూ సమస్యను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. కొమరాడ మండలానికి చెందిన ప్రజాసంఘాల నాయకుల మద్దతుతో పార్వతీపురంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలో శనివారం ఆయన పాల్గొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సాంబమూర్తి మాట్లాడుతూ, శివ్వాం గ్రామానికి చెందిన దళితులకు ప్రభుత్వం 50 సంవత్సరాల కిందట డి పట్టా భూములిస్తే.. కొంతమంది తప్పుడు ఉత్తర్వులతో వారి భూములు లాక్కోవడానికి ప్రయత్నిస్తున్నారని, అడిగితే దాడులు చేస్తున్నారన్నారు. పెత్తందారుల తీరును ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఖండిస్తున్నామని చెప్పారు. నిరసన కార్యక్రమాలు చేపడుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఇలాంటి సందర్భంలో జూలై 31వ తేదీ నుంచి రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నామని, ఇప్పటికైనా అధికారులు స్పందించి దళితులకు న్యాయం చేయాలని కోరారు. దళితులపై దాడి చేసిన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కమిటీ సభ్యుడు రెడ్డి శివనాయుడు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘ నాయకుడు అడివయ్య, ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘ నాయకుడు వెంకటేష్, పార్వతీపురం మన్యం జిల్లా కేవీపీఎస్ నాయకుడు పెంటయ్య, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహంపై దాడి హేయం



కొవ్వొత్తులు చేతపట్టి నిరసన తెలియజేస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే కళావతి, దళిత, ప్రజాసంఘాల నాయకులు

- ఎమ్మెల్సీ విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే కళావతి

పాలకొండ రూరల్: రాజ్యాధికార ఉన్మాదంతో సామాజిక న్యాయ మహాశిల్పంపై దాడి చేయటమంటే రాజ్యాంగ నిర్మాతను అవమానించటమే అని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ధ్వజమెత్తారు. విజయవాడ సమీపంలో ఏర్పాటు చేసిన భారీ అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసేందుకు యత్నించడాన్ని నిరసిస్తూ శనివారం రాత్రి నగర పంచాయతీ పాలకవర్గ సభ్యులు, మండల ప్రజాప్రతినిధులు, పలు దళిత, ప్రజాసంఘాల నాయకులతో కలిసి కొవ్వొత్తుల ర్యాలీ చేశారు. ఈ క్రమంలో స్థానిక యాలాం కూడలిలో అంబేడ్కర్ విగ్రహం వద్దకు చేరుకుని కూటమి ప్రభుత్వ అసమర్థతను ఎండగడుతూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాజ్‌భవన్‌కు కూతవేటు దూరంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహంపై దాడి చేయటం హేయమైన చర్య అన్నారు. తక్షణమే గవర్నర్ స్పందించాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలపై, నాయకుల విగ్రహాలు, శిలాఫలకాలపై దాడులు జరుగుతుంటే కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవటం అనుమానాలకు తావిస్తోందని నగరపంచాయతీ చైర్‌పర్సన్ యందవ రాధాకుమారి, దళిత నాయకులు లీల్లీ పుష్పనాథం, యందవ మరియదాసు తదితరులు పేర్కొన్నారు. నిమ్నవర్గాలు భగవంతునిగా భావించే బాబాసాహెబ్ జోలికి వస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ ఘటనకు పాల్పడిన దోషులను తక్షణమే అదుపులోకి తీసుకోవాలన్నారు. ఈ తరహా కుట్రలను మానుకోకుంటే మూల్యం చెల్లించక తప్పదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల కన్వీనర్లు వెలమల మన్మథరావు, కనపాక సూర్యప్రకాష్, వైస్ ఎంపీపీ వి.అనిల్‌కుమార్, న్యాయవాదులు, మేధావులు, యువత, పలువురు పట్టణ, మండల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సమష్టి కృషితో అభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న ఎంపీడీఓ

పాలకొండ రూరల్: అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధుల సమష్టి కృషితో గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ అన్నారు. గత మూడు రోజులుగా తన కార్యాలయంలో నిర్వహిస్తున్న రీఫ్రెషర్ శిక్షణలు శనివారంతో ముగిసాయి. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. తాజా శిక్షణ ద్వారా తెలుసుకున్న అంశాలను పంచాయతీల్లో అమలు చేయాలన్నారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, కిచెన్ గార్డెన్, శాశ్వత ప్రాతిపధికన ప్రజాప్రయోజనాలతో కూడిన పనుల గుర్తింపు, వాటి అమలు విధానం తదితర అంశాలపై మరింత అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యదర్శులు గ్రామ స్థాయిలో సర్పంచులకు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కె.సూర్యనారయణ, తదితరులున్నారు.

చర్చలు సఫలం



ఆర్టీసీ సిబ్బందితో చర్చలు జరుపుతున్న సీఐటీయూ నాయకులు

పార్వతీపురం టౌన్: స్థానిక ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులు తమకు వేతనాలు పెంచాలని ఐదు రోజులుగా విధులు బహిష్కరించి నిరసన తెలియజేస్తున్నారు. ఈ మేరకు శనివారం స్థానిక ఆర్టీసీ డిపోలో సీఐటీయూ నాయకులు, కాంట్రాక్టర్ తాతబాబు, గ్యారేజ్ ఇన్‌చార్జ్ ఎల్. రాము మధ్య చర్చలు జరిగాయి. మెకానిక్ కార్మికులకు గతంలో జీతం రూ. 13,500 ఇవ్వగా.. ప్రస్తుతం రూ. 14,300 ఇవ్వడానికి.. శ్రామికుల జీతం రూ. 8,500 నుంచి 9200 రూపాయలు ఇవ్వడానికి కాంట్రాక్టర్ ఒప్పుకున్నారు. దీంతో కార్మికులు శాంతించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు, కోశాధికారి గొర్లె వెంకటరమణ, కార్మికులు వెంకటేష్, భాస్కరరావు, ఎం. కృష్ణకాంత్, గంగాధర్, బి. త్రినాథరావు, కె. కిరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఐటీడీఏ పీఓ బదిలీ నిలుపుదల చేయాలి



నిరసన తెలియజేస్తున్న ప్రజాసమాఖ్య సభ్యులు

సీతంపేట: సీతంపేట ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి టి. రాహుల్‌కుమార్‌రెడ్డి బదిలీని నిలుపుదల చేయాలని గిరిజన ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిడ్డిక తేజేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు ఎ.మన్మథరావు శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. గిరిజనుల సమస్యల పట్ల చిత్తశుద్ధితో పనిచేస్తున్న అధికారిని విధుల్లో చేరిన పక్షం రోజుల్లోనే బదిలీ చేయడం సరికాదన్నారు. ఆయన్ను యధావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు.

ఐటీడీఏ పీఓ బదిలీపై నిరసన

సీతంపేట: సీతంపేట ఐటీడీఏ పీఓ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి బదిలీని నిరసిస్తూ ఐటీడీఏ ముఖద్వారం ప్రజాసమాఖ్య ఆధ్వర్యంలో పలువురు గిరిజనులు శనివారం ధర్నా చేశారు. ఆయన బదిలీ నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇక్కడ విధుల్లో చేరి 15 రోజులు గడవకముందే బదిలీ చేయడం అన్యాయమన్నారు. గిరిజన ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తానని సంకల్పంతో వచ్చిన పీఓను బదిలీ చేయడం తగదన్నారు. కార్యక్రమంలో ప్రజాసమాఖ్య జిల్లా అధ్యక్షుడు మోహన్‌పాల్, ఉత్తరాంధ్ర జిల్లా అధ్యక్షుడు సవర చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

పలకలను సరిచేసేదెన్నడో..?



శిథిలమైన కల్వర్టును పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ గోపాలరావు

గరుగుబిల్లి: తోటపల్లి ప్రాజెక్టు పునరావాస గ్రామమైన గిజబలో కల్వర్టులపై వేసిన పలకలు మరమ్మతులకు గురవ్వడంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు అవస్థలు పడుతున్నారు. కల్వర్టులు మరమ్మతులకు గురైన విషయం పంచాయతీరాజ్ అధికారులకు తెలియజేసినప్పటికీ పట్టించుకోకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈఓపీఆర్డీ ఎల్.గోపాలరావు శనివారం గ్రామాన్ని సందర్శించిన సమయంలో స్థానిక సర్పంచ్ మండల భాగ్యలక్ష్మి కల్వర్టులు, జలజీవన్ మిషన్ కింద ఏర్పాటు చేసిన తాగునీటి కుళాయిల పరిస్థితిపై ఆయనకు వివరించారు. మరమ్మతులు చేపట్టేలా చర్యలు చేపడతామని ఆయన హామీ ఇచ్చారు.

ఆదివాసీ హక్కుల కోసం పోరాడాలి



గిరిజన సంప్రదాయ నృత్యంతో అలరిస్తున్న బాలికలు

భామిని: మండల కేంద్రంలో హోలీక్రాస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సంస్థ డైరెక్టర్ కరణం ప్రభుదాస్, వరల్డ్ సంస్థ డైరెక్టర్ సునీత మాట్లాడుతూ.. ఆదివాసీల హక్కులు, సంస్కృతిని కాపాడడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అటవీ వనరులపై సంపూర్ణ హక్కు గిరిజనులకే ఉండాలన్నారు. గిరిజనోత్పత్తులకు విలువ పెంచి వారి ఆదాయాన్ని రెట్టింపు చేసేందుకు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా సంస్థ ఆధ్వర్యంలో టైలరింగ్‌లో ఉచిత శిక్షణ తీసుకుంటున్న యువతులు గిరిజన సంప్రదాయ నృత్యాలతో అలరించారు.

నిత్యావసర సరుకుల వితరణ



నిత్యావసర సరుకులు అందజేస్తున్న సర్పంచ్ గౌరీశంకరరావు

గుమ్మలక్ష్మీరం: గుమ్మలక్ష్మీపురం గ్రామానికి చెందిన హెల్పింగ్ హేండ్స్ సభ్యుడు మద్ది దొరబాబు గ్రామంలోని పలువురు ఒంటరి మహిళలు, నిస్సహాయులకు తొమ్మిది రకాల నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ బొత్తాడ గౌరీశంకరరావు చేతుల మీదుగా శనివారం సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. దొరబాబు తన పుట్టినరోజును పురస్కరించుకుని పేదలకు నిత్యావసర సరుకులు వితరణ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వైశ్య సంఘ అధ్యక్షుడు గుడ్ల హరిప్రసాద్, వర్తక సంఘ అధ్యక్షుడు బుడంకాయల వెంకటరావు, హెల్పింగ్ హేండ్స్ సభ్యులు పాల్గొన్నారు.

నిషేధిత వస్తువులు రవాణా చేస్తే చర్యలు



వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు

కొమరాడ: గంజాయి, అక్రమ మద్యం, సారా తదితర నిషేధిత వస్తువులు రవాణా చేస్తే చట్టప్రకారం చర్యలు తప్పవని ఎస్ఐ కె.నీలకంఠం అన్నారు. ఆంధ్రా-ఒడిశా సరిహద్దు గ్రామమైన కూనేరు వద్ద శనివారం జాగిలాలతో వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనలు నడిపినా, పరిమితికి మించి లోడుతో రవాణా చేసినా, లైసెన్స్, వాహన ధ్రువపత్రాలు లేకపోయినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

వరిలో ఎరువుల యాజమాన్యం ఇలా..



పంటపొలంలో వేసేందుకు ఎరువులను సిద్ధం చేస్తున్న రైతు

గరుగుబిల్లి: ఖరీఫ్ వరిసాగులో ఎరువుల యాజమాన్యం ఎంతో కీలకం. వేలాది రూపాయలు చెల్లించి కొనుగోలు చేసిన ఎరువులు పైరుకు సక్రమంగా అందుతున్నాయో లేదా అనే అంశాన్ని రైతులు గమనించాలి. యాజమాన్య పద్ధతులపై సరైన అవగాహన కలిగి ఉంటే తక్కువ ఎరువులతోనే ఎక్కువ దిగుబడులు సాధించేందుకు అవకాశం ఉంటుందని మండల వ్యవసాయాధికారి ఆర్.విజయభారతి సూచిస్తున్నారు.

- కాంప్లెక్స్ ఎరువులను దమ్ము సమయంలోనే వేయాలి.
- పంటపొలంలో తగినంత తేమ లేకుండా నత్రజని ఎరువులను వేయడం వల్ల పంటకు పూర్తిస్థాయిలో పోషకాలందవు.
- పంటపొలాల్లో ఎరువులు వేసినప్పుడు 2 సెం.మీ కన్నా నీరు ఎక్కువగా ఉండకుండా చూసుకోవాలి. ఎరువులు చల్లిన రెండు రోజులవరకు పొలంలో నీరు పెట్టకూడదు.
- భాస్వరం ఎరువులను ఆఖరి దుక్కిలోనే వేసుకోవాలి. లేదంటే ఈ ఎరువు ఎక్కడవేస్తే అక్కడే ముద్దలాగ ఉండిపోతుంది. పంటకు పూర్తిస్థాయిలో అందదు.
- వేసిన ఎరువులు పంటపొలాలలో మొక్కలవేరు భాగానికి అందేంత దగ్గరగా వుండాలి. వేసిన ఎరువులు అలాగే పైపొరలలో నిల్వవుంటే మాంగనీస్, జింక్, ఐరన్ లోపాలు తలెత్తుతాయి.
- పొటాష్ ఎరువులను దమ్ములోను, చిరుపొట్టదశలో వేసుకొంటే మంచిది. పొటాష్ వేయడం వల్ల గింజ నాణ్యత బాగుంటుంది. అలాగే పైరుకు రోగనిరోధకశక్తి పెరుగుతుంది.
- నత్రజని ఎరువుల వినియోగంలో పలు జాగ్రత్తలను తీసుకోవాలి. నత్రజని ఎరువుపై భూమిపై పడితే అమ్మోనియా రూపంలో ఆవిరైపోతుంది. తేమ ఎక్కువగావుంటే భూమి లోపల పొరలలోకి వెళ్లిపోతుంది.
- ఎరువులను వినియోగించేటప్పుడు కలుపుతీయడానికి ముందు వేసుకొంటే కలుపు తీసిన సమయంలో తొక్కుడుకు భూమిలో కలిసి మొక్కలకు ఎరువులు పూర్తిస్థాయిలో అందుతుంది.
- వేసిన ఎరువులు పంటకు అందాలంటే పొలంలో తగినంత తేమవుండాలి. లేకపోతే వేసిన ఎరువులు నేలలో కరగక గడ్డకట్టుకుపోయి అవసరానికి పనిచేయదు.
- నత్రజని, భాస్వరం, పొటాష్ ప్రధాన ఎరువులు కాబట్టి పంటలో ఎప్పుడు వేసుకోవాలి అనే విషయాలపై రైతులు అవగాహన కలిగి ఉండాలి.

మైనింగ్ లీజు రద్దు చేయాలి

పార్వతీపురం టౌన్: బడిదేవర కొండ గ్రానైట్ మైనింగ్ లీజు రద్దు చేయాలని సీపీఎం సీనియర్ రాష్ట్ర నాయకుడు, జిల్లా కమిటీ సభ్యుడు ఎం. కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సుందరయ్య భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ అనుమతి లేకుండా, సమీప గ్రామ ప్రజల ప్రజాభిప్రాయం తీసుకోకుండా లీజు మంజూరు చేయడం సరికాదన్నారు. తక్షణమే మైనింగ్ లీజును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన తప్పదని స్పష్టం చేశారు. పార్వతీపురం మండలం కోరి రెవెన్యూ పరిధిలో వెలగవలస దగ్గరలో గల బడిదేవరకొండ గ్రానైట్ మైనింగ్‌కు 2016లోనే లీజు లైసెన్స్ ఎంఎస్‌పీ గ్రానైట్ కంపెనీకి ఇవ్వడం జరిగిందన్నారు. మైనింగ్ చేయబోయే కొండ రిజర్వ్ ఫారెస్ట్‌కు సంబంధించినదని లీజు లైసెన్స్‌పై అటవీ శాఖాధికారులు అభ్యంతరం చెప్పారన్నారు. రెవెన్యూ, అటవీశాఖ ఉమ్మడి సర్వేలో ఆ భూమి ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్‌దేనని తేలడంతో 2017లో లీజు రద్దు చేశారని చెప్పారు. ఈ నేపథ్యంలో ఎంఎస్‌పీ గ్రానైట్ కంపెనీ హైకోర్టుకు వెళ్లగా.. 2023 ఏప్రిల్ 14న లైసెన్స్ పునరుద్ధరణ చేయాలని తీర్పు చెప్పిందని తెలిపారు. అటవీ శాఖ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండా ఇచ్చిన లైసెన్స్ అనుమతులను రద్దు చేయాలని కోరారు. బడిదేవర కొండను ఈ ప్రాంత ప్రజలు అమ్మవారిగా కొలుస్తారని, వారి నమ్మకాలను విశ్వసించి, లీజు లైసెన్స్ రద్దు చేయాలని కోరారు.